ఇదో డిఫరెంట్ లబ్ధి

- పలువురు ఉద్యోగులకు కలిసొచ్చిన 'స్పౌజ్' విధానం
- ఒకే ఇంట్లో ఉంటూ వేర్వేరుగా అద్దె పొందుతున్న వైనం
- హెచ్ఆర్ఏను దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వానికి నష్టం
- దృష్టిసారించని సర్కారు.. ఖజానాకు భారీగా గండి
- విస్మయం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు, మేధావి వర్గం!





భూపాలపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు ఉద్యోగులైనప్పుడు వారిద్దరు దూరంగా విధులు నిర్వర్తించడం వల్ల వ్యక్తిగత జీవితాలకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పౌజ్ పాయింట్స్ విధానాన్ని అమలు చేస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొందరు దీన్ని ఆసరాగా తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకే ఇంట్లో నివసిస్తూనే వేర్వేరుగా ఇంటి అలవెన్సులు పొందుతున్నారు. జిల్లా ఒకటే అయినప్పటికీ వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉంటూనే ఇద్దరూ హెచ్ఆర్ఏ తీసుకోవడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు కూడా ఇదేమీ పట్టించుకోకుండా ఎంచక్కా హెచ్ఆర్ఏ చెల్లించడం విస్మయం కలిగిస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40వేల మంది ఉద్యోగ దంపతులు (స్పౌజ్) ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి ప్రతినెలా రూ.480 కోట్ల వరకు ఆదాయానికి గండిపడుతున్నట్లు విద్యావేత్తలు చెబుతున్నారు. ఒక్క జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనే సుమారు 650 మంది ఉంటారని అధికారులు అంటున్నారు. వీరిలో ఒక్కొక్కరికి నెలకు రూ. 8 వేల నుంచి 10 వేల వరకు ప్రభుత్వం హెచ్ఆర్ఏ చెల్లిస్తోంది. ఇలా నెలకు సుమారు రూ. 52 లక్షల చెల్లింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. భార్యాభర్తలు ఇద్దరు ఒకే జిల్లాలో పనిచేయాలనే మంచి ఉద్దేశంతో స్పౌజ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుండగా కొందరు దీన్ని ఆసరా చేసుకొని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒకే ఇంట్లో ఉంటున్నప్పటికీ వేర్వేరుగా హెచ్ఆర్ఏ పొందుతున్న వారు ప్రభుత్వానికి భారీ నష్టం కలిగిస్తున్నారని మేధావి వర్గం మండిపడుతోంది.

ఒకే ఇంట్లో ఉంటూనే...

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాగా 33 జిల్లాలుగా ఏర్పడ్డాయి. ఒక్కో జిల్లా విస్తీర్ణం సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల వ్యవధిలోనే ఉంటుందనేది అధికారుల అంచనా. ఒకే జిల్లా, ఒకే మండలంలో పనిచేస్తున్నా అరగంట నుంచి గంటలోపు మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రభుత్వం బదిలీల్లో భాగంగా స్పౌజ్ ఉద్యోగులకు సర్వీస్‌తో సంబంధం లేకుండా 10 పాయింట్లు కేటాయించి స్థాన చలనం కలిగించింది. దీంతో ఎక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు చివరికి మిగిలిపోయిన ప్రాంతాల్లోకి బదిలీ అయ్యారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా స్పౌజ్ పాయింట్లతో లాభం పొందిన భార్యాభర్తలు ఒకే ఇంటి అద్దె కాకుండా ఇద్దరికి ఇద్దరూ అలవెన్సు పొందడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తుండగా దాంతో కూడా మహిళా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు. ఒకవైపు ఇంటి అద్దె అలవెన్స్ తీసుకుంటూనే ప్రయాణ ఖర్చులు తగ్గించుకుంటూ అదనంగా ప్రయోజనం పొందుతున్నారని తెలుస్తోంది.

రికార్డులు సృష్టించి...

భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉంటున్నా వేర్వేరుగా నివస్తున్నట్టు రికార్డులు సృష్టించి ఇద్దరికి ఇద్దరూ అద్దె అలవెన్సులు పొందుతున్నారని తెలుస్తోంది. ఇద్దరు ఉద్యోగస్థులే అయినప్పటికీ ఒకే ఇంట్లో ఉంటూ ఇద్దరూ హెచ్ఆర్ఏ తీసుకోవడంపై పలువురు ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. వెనుకబడిపోయి కుటుంబంతో గడపలేక, వృద్ధ తల్లిదండ్రులను చూసుకోలేక తోటి వారి ముందు చులకన అవుతున్న వారికి స్పౌజ్ పాయింట్ల విధానం వరంగా పనిచేస్తుంది. కానీ అలాంటిదేమీ లేకుండా సౌకర్యంగా ఉన్నవారు కూడా ఇష్టమొచ్చినట్లు అద్దె తీసుకోవడం ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది ప్రభుత్వాన్ని పక్కదోవ పట్టించడమేనని ఆరోపణలు వస్తున్నాయి. పైగా ఒకే ఇంట్లో ఉండే స్పౌజ్ ఉద్యోగులు ఆదాయ పన్ను రిటర్న్‌లో మాత్రం రెండు గృహాల్లో నివాసం ఉంటున్నట్లు తప్పుడు డిక్లరేషన్లు ఇస్తూ లబ్ధిపొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. బతుకమ్మ పండుగ సంబరాలపై సమీక్షించారు. గ్రామాలు, మునిసిపాలిటీ పరిధిలోని బతుకమ్మ ఘాట్ల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు చేయాలన్నారు. రహదారులు, వీధిలైటింగ్, తాగునీరు, పరిశుభ్రత, భద్రతా చర్యలు, వైద్య సేవలు అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, మునిసిపాలిటీల్లోని కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దలన్నారు. గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అక్టోబర్ 2 దసరా రోజు అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే వేడుకల్లో సాంస్కృతిక కళాకారులతో కార్యక్రమాన్ని నిర్వహించాలని డీపీఆర్వోను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి బెల్లయ్య నాయక్



భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ హాజరు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

తగ్గుముఖం పడుతున్న గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. ఇటీవల మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు ఆదివారం వరకు గోదావరి పోటెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి గోదావరికి వరద తక్కువ కావడంతో 10.7 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవాహం కొనసాగుతోంది.

వరుస దొంగతనాల ముఠా అరెస్టు



దొంగల ముఠా అరెస్టును చూపిస్తున్న పోలీసులు

మహాముత్తారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. పలు మండలాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించగా సోమవారం తెల్లవారు జామున యామన్‌పల్లి వద్ద ఆటోలో వెళ్తా నలుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో కాటారం మండలం దేవరాంపల్లి గ్రామానికి చెందిన చిగురు సంతోష్, బుర్రకుంట ప్రకాశ్, జైనేని రమేష్, షేక్ ఖుద్రత్ ఉండగా తాము వరుస దొంగతనాలకు పాల్పడుతున్నామని వారు అంగీకరించారు. వీరు నలుగురు ఆటోలో పగలు రిక్కీ చేస్తూ రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్నారని పోలీసుల విచారణలో తేలింది. జల్సాలకు అలవాటుపడి ఏడాది కాలంగా దొంగతనాలు చేస్తున్నామని నిందితులు వెల్లడించారు.

కాటారం మండల కేంద్రంలో మూడు, మల్హర్ మండలం తాడిచర్లలో రెండు, పలిమెలలో ఒకటి, మహాముత్తారంలో ఒకటి దొంగతనాల్లో వీరు పాల్గొన్నారని డీఎస్పీ తెలిపారు.

తప్పుడు ప్రచారాలు మానుకోండి

- మేడారం అభివృద్ధిని వ్యతిరేకించడం సరికాదు
- ఆదివాసీలు, పూజారుల అభీష్టం మేరకే శాశ్వత పనులు
- సంస్కృతీ సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుంటాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేడారం అభివృద్ధిపై కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి దుశ్చర్యలను మానుకోవాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మేడారంలో ఆమె పర్యటించారు. పూజారులు, అధికారులతో సమావేశమయ్యారు. ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా మేడారంలో రాతి కట్టడాలతో చేపట్టనున్న శాశ్వత నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనదేవతలు సమ్మక్క, సారలమ్మ అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎనలేని విశ్వాసం అని తెలిపారు. చరిత్రలో నిలిచియేలా మేడారంలో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఇందుకు రూ. 150 కోట్లు మంజూరు చేశారన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేయడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మేడారంలో అభివృద్ధి పనులను పూజారులు, ఆదివాసీల అభిప్రాయం మేరకే చేపడతామన్నారు. 700 చిత్రాలు, గొట్టు గోత్రాలు, సంస్కృతీ సంప్రదాయాలు, వన దేవతల చరిత్రలు, ఆదివాసీల మూలాలు శాశ్వతంగా నిలిచిపోయేలా రాతి కట్టడాలపై లిఖించనున్నట్టు తెలిపారు. దేవస్థానం అభివృద్ధిపై కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. ఆదివాసీలు, పూజారుల అభిప్రాయం మేరకు రూపొందించిన దేవస్థానం డిజైన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్టు తెలిపారు.

సుదీర్ఘంగా చర్చించాకే కొత్త డిజైన్లు : జగ్గారావు

మేడారం దేవస్థానం అభివృద్ధిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని పూజారుల సంఘం సిద్ధబోయిన జగ్గారావు అన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ, పడిగిద్దరాజు, గోవిందరాజుల చరిత్రలు పుట్టుపూర్వం ఆదివాసీల మూలాలు, పడగలు, గొట్టు, చిహ్నాలు, జీవిత చరిత్రలు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నూతనంగా డిజైన్లు రూపొందించారని తెలిపారు. రూపొందించిన దేవస్థానం అభివృద్ధిపై తమకు ఎలాంటి సందేహాలు లేవని స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి భంగం కలిగించే ప్రచారాలు చేయొద్దని, ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగానే దేవస్థానం అభివృద్ధి జరుగుతోందని తెలిపారు.

ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు మునీందర్, కృష్ణయ్య, సారయ్య, కిరణ్, సిద్ధబోయిన స్వామి, రఘుపతిరావు, రమేష్, అధికారులు, ఆదివాసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

పెన్షన్లు పెంచాలని తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

కాటారం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల పెన్షన్‌దారులు సోమవారం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. వికలాంగులతోపాటు వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళల పెన్షన్ డబ్బును పెంచాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి ఆధ్వర్యంలో పెన్షనర్లు ముట్టడికి తరలివచ్చారు. పోలీసులు తహసీల్దార్ కార్యాలయం గేటు మూసి వేయడంతో అక్కడే ఆందోళన చేశారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల సమయంలో పెన్షన్లను పెంచడం, నూతన పెన్షన్ల మంజూరు చేయడంపై ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ జిల్లా, మండల నాయకులు గోగు రవీందర్, శంకర్, చిట్యాల సమ్మయ్య, రాకేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



వెంకటాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నేలవారిపేటలో సోమవారం జరిగింది. ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపినవివరాల ప్రకారం.. గ్రామంలోని సంగం సమ్మక్క(60) రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి కడుపునొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఇంటిముందు ఉన్న బావిలో సమ్మక్క దూకి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం సమ్మక్క కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఇంటిముందు ఉన్న బావిలో మృతదేహం కనిపించింది. దీంతో గ్రామస్థుల సహాయంతో సమ్మక్క మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

- పీఎం శ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్
- మంత్రి సురేఖ ఇంటి ముట్టడి
- మంత్రి హామీతో ఆందోళన విరమణ

వివరాలు 7లో..



మంత్రి కొండా సురేఖ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

బహుజన బతుకమ్మ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సామ పూలక్క విగ్రహం వద్ద బహుజన బతుకమ్మ కార్యక్రమ కరపత్రాన్ని సోమవారం రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సదానందం మాట్లాడుతూ ప్రకృతి విధ్వంసం అంటేనే ప్రజలపై యుద్ధమని, ప్రకృతికి మరోరూపం స్త్రీ అని, అలాంటి ప్రకృతిని సామ్రాజ్యవాదుల లాభం కోసం పాలకులు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. .గుట్టలను, అడవులను ధ్వంసం చేయడంతో ప్రజల జీవనవిధానం చిన్నాభిన్నమైందని, అభయారణ్యాల పేర ఆదివాసీలను అడవికి పరాయి వారిని చేస్తున్నారని అన్నారు. మోదీ, అమిత్‌షాల నేతృత్వంలో నరమేధం కొనసాగుతోందని, ఆపరేషన్ కగార్ హత్యాకాండలో భాగమే ఇటీవల ఒడిశా-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని గరియాబందులో జరిగిన బూటకపు





విద్యార్థులకు హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందిస్తున్న కలెక్టర్

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

● ఆరోగ్య పరిరక్షణకు చర్యలు : జనగామ కలెక్టర్

● కేజీబీవీలో విద్యార్థులకు హెల్త్ ప్రొఫైల్ కార్డుల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధితో పాటు ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. సోమవారం జనగామ జిల్లా మండలం స్టేషన్‌ఘన్‌పూర్ నెమలిగొండ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ కార్డుల పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దిక్సూచిలో భాగంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించి వారి ఉన్నతమైన విద్యకు బాటలు వేసేందుకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను హెల్త్ ప్రొఫైల్ కార్డులో నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 39 సంక్షేమ హాస్టల్స్‌కు సంబంధించిన 14,993 మంది విద్యార్థులకు కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మల్లిఖార్జున్ రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రజిత పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వినతులతోపాటు పాటు ప్రజాభవన్ హైదారాబాద్ నుంచి వచ్చిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తునూ పరిశీలించి అర్జీదారులకు సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 70 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్పీవో వెంకటిరెడ్డి అన్నారు. సోమవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు జీపీలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు జీపీ తరపున చేపట్టాలన్నారు. పైప్ లీకేజీలు లేకుండా చూడాలని, పల్లె ప్రకృతివనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, శ్మశాన వాటికలను శుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రూపచైతన్య పాల్గొన్నారు.



కొడవటూరులో జీపీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో

దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయొద్దు

● పూజారుల అంగీకారం మేరకే గద్దెల ప్రాంతంలో మార్పిడి

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన గొట్టు గోత్రాలు, ఆచారాల ప్రకారం సమ్మక్క, సారలమ్మల పూజారుల అంగీకారం మేరకే గద్దెల ప్రాంతంలో నూతన టెక్నాలజీతో పనులను చేపట్టినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. పూర్తిస్థాయిలో డీపీఆర్ పూర్తికాగానే సీఎంతో సమావేశమై పూర్తి నిర్ణయాలు తీసుకున్నట్టు స్పష్టం చేశారు. ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, కలెక్టర్ టీఎస్.దివాకరలతో కలిసి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకోసం ఇంచర్ల గ్రామశివారులో భూములు కోల్పోయిన 41మంది రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు గ్రామాల గుండా రోడ్డు విస్తరణ పనులు చేయడమేకాకుండా డైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నివేదికలను సంబంధిత అధికారులు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. జాతర సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామని, గత జాతర సందర్భంగా రైతులకు నష్టపరిహారం అందించినట్లు పేర్కొన్నారు.



రైతులకు నష్టపరిహార చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క

గత కొద్ది రోజులుగా గిరిజన పూజారులు, దేవాదాయశాఖ అధికారులు, ఆర్కియాలజీ అధికారులతో పలు దఫాలుగా సమావేశం నిర్వహించి పలు రకాల నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. జాతరకు పక్షంరోజుల ముందే పనులను ముగిస్తామని, గిరిజన పూజారులు, భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా ఆలోచనలు చేస్తున్నామని, వెయ్యి సంవత్సరాలు నిలిచిపోయేలా మంచి నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. పనులు ప్రారంభించకముందే పలువురు పలు రకాల ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, గద్దెల ఏర్పాటుపై రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క-సారలమ్మ జాతర, దట్టమైన అటవీప్రాంతం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రపంచవ్యాప్తంగా అమ్మవార్ల ప్రాముఖ్యత సంతరించుకుందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికలు సిద్ధంచేసుకుని పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. మేడారం ప్రాంతంలో 30పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి సీతక్కను కోరారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏకో పార్కు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం రానున్నరోజుల్లో అందనంత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలను పరిష్కరించాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జనగామలో నెలకొన్న పారిశుధ్య, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ, 60ఫీట్ల రోడ్డులోని శ్మశాన వాటికతోపాటు పలు వార్డుల్లో సోమవారం పర్యటించారు. కలెక్టర్ కలిసి పట్టణ సమస్యలపై వినతిపత్రం అందించారు. పల్లా మాట్లాడుతూ ఆర్‌వోబీ, రోడ్లు, వీధుల్లో లైటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో మెరుగైన పారిశుధ్యం అందించేందుకు అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. శ్మశాన వాటికల నిర్వహణ సరిగ్గా చేపట్టాలన్నారు. వర్షపు నీరు సులభంగా వెళ్లేలా పట్టణంలోని అరబిందో స్కూల్ వద్ద కల్వర్టును నిర్మించాలన్నారు. బాణాపురం ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. హనుమకొండ రోడ్డులో ప్రతిపాదించిన స్థలంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలన్నారు. పట్టణంలోని సర్వే నంబరు 53/1లో ఇంటి నంబరు కేటాయించిన వారికి ఇళ్ల పట్టాలు అందించాలన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఓల్డ్ రైల్వే గేట్ అండర్‌పాస్‌కు రెండు వైపులా మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు.



అండర్‌డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

17న ప్రజాపాలనా దినోత్సవం

జాతీయ పతాకాలు ఎగురవేసేది వీరే

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిజాం విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలనా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించే మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సురేఖ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జనగామ జిల్లాలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మహబూబాబాద్ జిల్లాలో డిప్యూటీ స్పీకర్ జె రామచంద్ర నాయక్, ములుగు జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేస్తారు.

సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ సేవలను సీఎస్సీకి కేటాయించాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ సేవలను కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ)కి కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపెల్లి వెంకటేశ్ కోరారు. జనగామ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించామన్నారు. అనంతరం మండల కేంద్రంలో మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న సీఎస్సీ సెంటర్‌లో పదేళ్లుగా కేంద్ర పథకాలు, రాష్ట్ర సర్వేలకు సంబంధించిన కొన్ని సేవలను తమ సీఎస్సీ సెంటర్‌ల ద్వారా అందిస్తున్నామన్నారు. గ్రామస్థాయిల్లో ఉండే తమ సెంటర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలకు సంబంధించిన సర్వీసులు అందించేలా చేయటంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయన్నారు. రాష్ట్ర నాయకులు కొన్నె రామకృష్ణ, వగలబోయిన కృష్ణ, అనుప మహేందర్, అశోక్, విష్ణు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

● 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 7.40 లక్షల క్యూసెక్కులుగా నమోదు కాగా గేట్లన్నీ ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 7.80 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కరాటేలో గోల్డ్ మెడల్

రఘునాథపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 14న జరిగిన ఐకిడో కరాటే ఛాంపియన్ షిప్‌లో వెల్ది మోడల్ స్కూల్‌లో చదువుతున్న సిద్దార్థ గౌతమ్‌కు బ్రౌన్ బెల్ట్ స్పారింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ లభించింది. నాలుగేళ్ల నుంచి స్పార్క్ కాయ్ షోటోకాన్ కరాటే అకాడమీ ఇండియా సంస్థలోని కోచ్ అనిల్ దగ్గర శిక్షణ పొందుతున్నాడు. గౌతమ్‌ను సోమవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్, ఉపాధ్యాయులు గణేష్, రాజు, మల్లం శ్రీధర్, దారం శ్రీను, రవి, రామకృష్ణ స్వామి, వ్యాయమ ఉపాధ్యాయులు రాజయ్య, వాసుదేవ్ అభినందించారు.

హెచ్‌ఆర్‌పీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య



గోవిందరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ (హెచ్ ఆర్‌పీపీ ఎస్) రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రానాగారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరాకుల సమ్మయ్యను నియమిం చారు. ఈమేరకు హెచ్‌ఆర్‌పీపీఎస్ జాతీయ అధ్యక్షుడు కొంపెల్లి సత్యనారాయణగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

టీపీవోను సస్పెండ్ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిని సస్పెండ్ చేయాలని బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు శ్యాంలాల్, దేవరావు, అజయ్, సాగర్, వికాస్, ప్రేం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాలల బాలికలను మత మార్పిడి చేసేందుకు ప్రయత్నించిన టీపీవోను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మైనర్లను టీపీవో, ఆయన భార్య ఇంటికి రప్పించుకొని మతం మార్చే కుట్ర చేశారని ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భర్తపై హత్యాయత్నం

●ప్రియుడితో కలిసి దాడి చేసిన భార్య

● వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని దారుణం

● మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంలో ఘటన

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తపై కక్ష పెంచుకున్న భార్య ప్రియుడితో కలిసి దాడికి పాల్పడింది. ఆమె భర్తను పట్టుకోగా.. ప్రియుడు కత్తితో పొడిచాడు. ఈ సంఘటన మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడి తండ్రి పాపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడ పాపయ్య-భద్రమ్మల పెద్ద కుమారుడు మేడ ప్రసాద్‌కు పాకాల కొత్తగూడెం గోవిందాపురం గ్రామానికి చెందిన ఈక రాజు-సుమలతల కుమార్తె రష్మితతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు కుమారుడు సంతానం. ప్రసాద్ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 6 నెలల క్రితం రష్మితకు ఇన్‌స్టాగ్రామ్‌లో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన మద్దెల అనిల్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీనికి భర్త ప్రసాద్ అడ్డు వస్తున్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను చంపేయాలని నిర్ణయానికి వచ్చారు.



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్

ఈ నెల 14న రాత్రి ప్రసాద్ భార్య రష్మిత ప్రియుడు అనిల్‌కు ఫోన్ చేసి గడ్డిగూడెంనకు రప్పించింది. కుటుంబ సభ్యులు గాఢ నిద్రలోకి జారుకున్న అనంతరం ప్రియుడు అనిల్, రష్మిత కలిసి భర్త ప్రసాద్‌పై కత్తితో దాడి చేయడంతో చెవి, ఛాతి, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. దీంతో అతను కేకలు వేయడంతో పక్కనే ఉన్న తల్లిదండ్రులు, సోదరుడు ఇంటికి వచ్చారు. దాడి చేసిన అనిల్‌ను తాళ్లతో చెట్టుకు కట్టేసి మహబూబాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని అనిల్, రష్మితను అదుపులోకి తీసుకుని మానుకోట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిగా తరలించి చికిత్సనందిస్తున్నారు. కాగా, బాధితుడి తండ్రి పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

72 ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలిచిపోనున్న సేవలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. మంగళవారం రాత్రి నుంచి రోగులను అడ్మిట్ చేసుకునే కార్యక్రమాన్ని నిలిపివేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిరాకరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1400 కోట్లు బకాయిలు పేరుకుపోయినట్లు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పిటల్ అసోసియేషన్ ప్రకటించింది. గతంలో ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు.

అత్యవసర రోగులకు ఇబ్బంది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులతోపాటు న్యూరో సంబంధిత వ్యాధుల బారిన పడే వారికోసం అత్యవసర చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇలాంటిరోగులు ఇంతకాలం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు అందించేవి. సమ్మె కారణంగా ఇకపై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై భారం పడనుంది. ఇప్పటికే రోగులతో కిటకిటలాడే ఆస్పత్రిపై పెనుభారం పడనుంది. ఎంజీఎం ఆస్పత్రి ఏఎంసీ, ఐఎంసీలో పడకల కోసం క్యూలు కడుతున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బంద్‌తో కిక్కిరిసిపోయే ప్రమాదం ఉంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అధికారులు సిద్ధం

రోగుల తాకిడిని వైద్య అధికారులు గుర్తించి తాత్కాలికంగా పడకలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా కొత్తగా నర్సంపేట, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామలలో వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రులలో సేవలు విస్తృతం చేసేందుకు వైద్యాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అత్యవసరమైతే తప్ప వరంగల్‌కు రెఫర్ చేయవద్దని సూచించినట్లు సమాచారం. పండగ ముందు ప్రజారోగ్యానికి వైద్య సేవలు ఆటంకం ఇబ్బందిగా మారనుంది.

ఆర్థిక ఇబ్బందులతో దివ్యాంగుడి ఆత్మహత్య

బచ్చన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన దివ్యాంగుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం వీఎస్ఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. వీఎస్ఆర్‌నగర్‌కు చెందిన చింతల అర్జున్ (33)కు భార్య అనూష, ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నారు. దివ్యాంగుడు కావడంతో ఆటో లో ఇటుకాలపల్లికి ప్రతి రోజు ఉదయం పాలు తరలిస్తూ ఉపాధి పొందుతున్నాడు. తమకున్న భూమిలో భార్య వ్యవసాయ చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటోంది. గతంలో ఉన్న అప్పులకు తోడు, ఇటీవల ఆటో చెడిపోవడంతో మరో ఆటో కొనుగోలుకు అప్పు చేశాడు. సుమారు రూ.8 లక్షల వరకు అప్పు అయింది. వాటిని తీర్చే మార్గం కనిపించక వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అబ్దుల్ హమీద్ తెలిపారు.



అర్జున్(ఫైల్)

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7440	5300
మక్కలు	2100	1521
కందులు	4352	3022
పెసళ్లు	6250	3022
పల్లికాయ (సూక)	5900	3500
పల్లికాయ (పచ్చిది)	3700	2400
పసుపు (కాడి)	10510	7889
పసుపు (గోల)	9580	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16300	12000
యూఎస్341ఏసీ	14000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



కావలెను

★ A TO Z BAZAR నందు పనిచేయుటకు అమ్మాయిలు / అబ్బాయిలు కావలెను. వెంటనే సంప్ర: A to Z బజార్, అదాలత్ సర్కిల్, గట్టు మహేష్ కాంప్లెక్స్, హన్మకొండ. AJW-427

WANTED

★ HNKలో ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవం గల ల్యాబ్ టెక్నీషియన్, రిసెప్షనిస్ట్ మరియు ANM/GNM కావలెను. (టైమింగ్స్ 7am to 4pm) సంప్ర: 8712608501 AJW-4153

HOUSE FOR SALE

★ HNK Opp : KUC Police Station, రుద్రమదేవి కాలని, రోడ్ నెం.8, ఫేసింగ్ 3/2 BHK Ready to Move, మూడు ఇండిపెండెంట్ ఇండ్లు, 160 Sqy, Rs.68 Lakhs కి అమ్మకానికి కలవు. సంప్ర: 9118706786, 8074260608. AJW-243069

LODGE FOR SALE

★ WGL-ములుగు రోడ్, I.T.I. ఎదురుగా గల A-1 LODGE (A/C, NON-A/C & కామన్ బెడ్స్) అన్ని సౌకర్యాలు గలది అమ్మబడును. కావలసినవారు వెంటనే సంప్రదించండి. సెల్ : 9666199661 AJW-554

JOB/SERVICES

★ Any Degree Software with Training and Placement at Hyderabad Contact : 8096520976 AJW-6651

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

సామాన్యులే.. సాయుధులై..

- పోరులో రక్తమోడిన తమ్మడపల్లి(జి)
- 12 మందిని కాల్చి చంపిన నిజాం సేనలు
- ఎదురొడ్డి పోరు నడిపిన అచ్చమాంబ
- అమరులను స్మరించుకుంటున్న పోరుగడ్డ
- 17న తెలంగాణ విమోచన దినోత్సవం


తమ్మడపల్లి(జి)లోని అమరుల స్మారక స్థూపం

జఫర్‌గడ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నిరంకుశ పాలకుల నుంచి విముక్తి చేసేందుకు, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సామాన్యులే సాయుధులై.. సారథులుగా మారిన తెలంగాణ విమోచనోద్యమంలో వీరుల త్యాగాలు వెలకట్టలేనివి. జనగామ జిల్లాలో పాలకుర్తికి చెందిన చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం భూ పోరాటానికి నాంది పలకగా.. దొడ్డి కొమురయ్య ఆత్మార్పణతో సాయుధ పోరాటంగా మారింది. ఆయన బలిదానం తెలంగాణలో ప్రజా వెల్లువను సృష్టించింది. 'నీ బాంచెన్.. కాల్మొక్తా' అంటూ జోడించిన చేతులు బందూకులు పట్టాయి. దశాబ్దాల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సామాన్యులే సాయుధులై జరిపిన పోరాటమే.. నాటి తెలంగాణ సాయుధ పోరాటం.

జఫర్‌గడ్‌లో పోరాట క్రమం..

తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్ ప్రాంతంలో నైజాం, రజాకార్లు, భూస్వాముల అణిచివేత, నిర్బంధకాండకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు ఉద్యమించారు. జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని పాలిస్తున్న నైజాం పాలకుల అనుచరుడైన రజాకార్ల నాయకుడు పాల్పడుతున్న ఖాదరెల్లి వేధింపులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీర్‌దారుల ఆగడాలను ప్రజలు రక్షక దళాలను ఏర్పరచుకుని చేతికందిన రాళ్లు, కర్రలు, వడిసెలు, బరిసెలు, కత్తులు వంటి సంప్రదాయ ఆయుధాలతో ఎదుర్కొని పోరాడారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, పంబాల రాఘవరావు, ఎలమంద తదితరులు సంచరిస్తూ రక్షక దళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు.

12 మందిని కాల్చి చంపిన పోలీసులు...

సాయుధ పోరులో భాగంగా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్ర మహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో నిర్బంధకాండను సాగిస్తున్న రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి ఆగడాలకు వ్యతిరేకంగా పలు గ్రామాల ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. ఈ దాడుల క్రమంలో తిరగబడుతున్న పోరాట యోధులను హతమార్చేందుకు 1948, సెప్టెంబరులో నిజాం, రజాకార్ల పోలీసు మూకలు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12మందిని నిర్బంధించి గ్రామ సెంటర్‌లో నిలబెట్టి వారిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్ననర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహారామయ్య, కుంట పెద్దాపురంలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, అతడి పశువుల కొట్టం, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నాటి పోరాట క్రమాన్ని ప్రజలు చర్చించుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.

ఆయుధం పట్టిన అచ్చమాంబ ..

జిల్లాలోని జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్‌రావుతో కలిసి నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధం పట్టింది. ప్రత్యక్షంగా పాల్గొని నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలు, దుశ్చర్యలకు వ్యతిరేకంగా మహిళలు, ప్రజలను చైతన్యవంతం చేస్తూ పోరాటం సాగించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14 ఏళ్ల వయసులోనే నైజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో పరిచయం ఏర్పడడంతో వారిద్దరూ వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ ఆయుధాలతో సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకం. భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం హనుమకొండలో కుమార్తె వద్ద ఉంటోంది.


సాయుధ పోరాటంలో పాల్గొన్న కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (ఫైల్)

రెచ్చిపోతున్న రౌడీ షీటర్లు

- దందాలు, సెటిల్‌మెంట్లలో బిజీబిజీ
- మాట వినకపోతే భౌతికదాడులు
- పోలీసుల కౌన్సెలింగ్‌కు సైతం దూరం
- ఖాకీలకు సవాల్‌గా మారిన గ్యాంగులు



మట్టెవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పగలంతా జులాయిగా తిరగడం.. రాత్రయిందంటే మద్యం సేవించి గొడవలు సృష్టించడం నగరంలో సర్వసాధారణం అయిపోయాయి. గతంలో రౌడీల ఆగడాలు కొంత మేరకు తగ్గినా పోలీసుల నిఘా కొరవడడంతో ఇటీవల మళ్లీ ఎక్కువయ్యాయి. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీలు రెచ్చి పోతున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. మాట వినకపోతే భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు నెలవారీగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లకు సైతం కొంత కాలంగా రౌడీ షీటర్లు హాజరుకావడం లేదు. ఇటీవల గణపతి నిమజ్జనం రోజున కరీమాబాద్ ప్రాంతంలో ఒక రౌడీ షీటర్ తన గ్యాంగుతో వచ్చి గణేశ్ మండప నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. ఈ నెల 7వ తేదీన మండిబజార్‌లోని ఒక హోటల్ వద్ద ఇద్దరు యువకులతో గొడవ పడి బీరు బాటిల్‌తో దాడికి పాల్పడ్డారు. సదరు రౌడీ షీటర్‌పై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో, మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాని ఇప్పటివరకు పోలీసులు అతడిని అరెస్టు చేయలేదు. రౌడీ షీటర్లను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

దాడులు, సెటిల్‌మెంట్లు..

నగరంలోని రౌడీ షీటర్లు ల్యాండ్ సెటిల్‌మెంట్లలో బీజీగా ఉంటున్నారు. కొంత మంది రియల్టర్లు, రాజకీయ నేతల అండతో భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రే పట్టా భూముల్లో పాగా వేస్తున్నారు. యాజమానులను రౌడీలతో బెదిరిస్తున్నారు. ఇటీవల వరంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రైవేట్ గ్యాంగు కాలనీ స్థలాన్ని కబ్జా చేశారు. కాలనీవాసులు అడ్డుకుంటే వారిపైన దాడులకు పాల్పడ్డారు. ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని చేతులు దులుపుకున్నారు. సివిల్ కేసు అని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. ఏదోలా సెటిల్‌మెంట్లు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు రౌడీ షీటర్లు దూరం..

పోలీసులు నెలవారీగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లకు చాలా మంది రౌడీ షీటర్లు హాజరుకావడం లేదు. కొంత మంది రాజకీయ నేతలతో ఫోన్లు చేయించుకుంటున్నారు. ఇటీవల వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు చాలా మంది రౌడీ షీటర్లు హాజరు కాలేదు. పోలీసులకు తెలియకుండా కొంతమంది రౌడీలు గొడవలు సృష్టిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అర్ధరాత్రి వరకు హోటళ్లు.. బార్లు..

వరంగల్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా బిర్యానీ సెంటర్లు, బార్లు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. పోలీసులు నామమంత్రంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వరంగల్ మండిబజార్, ఎల్బీనగర్, నిజాంపుర, చౌర్‌బౌళి ప్రాంతంలో అర్ధరాత్రి వరకు టిఫిన్ సెంటర్లు, హోటళ్లు తెరిచి ఉండడంతో తరచూ మద్యం సేవించిన వాళ్లు గొడవలు సృష్టిస్తున్నారు.

రౌడీ షీటర్లపై నిఘా ఏది..

వరంగల్ మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొంతమంది రౌడీషీటర్లు తరుచుగా గొడవలకు పాల్పడున్నా పోలీసులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 మంది రౌడీషీటర్లు ఉండగా డీసీ, కేడీ, సస్పెక్టు కేసుల్లో మరో 50 మంది ఉన్నారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మంది రౌడీషీటర్లు, డీసీ, కేడీ, సస్పెక్టు షీట్‌లో మరో 87 మంది ఉన్నారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలో 74 మంది రౌడీ షీటర్లు ఉన్నారు. సస్పెక్టు షీట్, డీసీ, కేడీ షిట్‌లో మరో 166 మంది ఉన్నారు. పోలీసుల నిఘా పూర్తిస్థాయిలో లేకపోవడంలో వారు తరచుగా గొడవల్లో తలదూరుస్తున్నారు.


రౌడీ షీటర్లతో పోలీసుల దోస్తానా..

వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కొంతమంది రౌడీషీ టర్లతో కొందరు పోలీసులు ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారని, వారితో కలిసి పార్టీలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సుగుట్ట, హంటర్‌రోడ్డు, రంగంపేట, రామన్నపేట, కొత్తవాడ, దేశాయిపేట, కాశిబుగ్గ, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రెచ్చిపోతూ గొడవల్లో తలదూరుస్తున్నారని నగర ప్రజలు మండిపడుతున్నారు.

రజాకార్ల రాక్షసత్వం

8 మంది తెలంగాణ యోధులు బలి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ యోధులు నడుం బిగించిన రోజులు.. నిజాం రాక్షసత్వానికి చరమగీతం పాడాలని తహతహలాడుతున్న తెలంగాణ యోధులపై రజాకార్లు కక్ష కట్టారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ పాత పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి తెలంగాణ యోధులు తుపాకులు ఎత్తుకెళ్లారు. దీంతో భీమదేవరపల్లి మండలంపై రజాకార్లు ఎనిమిది మంది తెలంగాణ యోధులపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ముల్కనూర్ గ్రామానికి చెందిన కూన రేశయ్య, ఎర్రబెల్లి గ్రామానికి చెందిన లంబాడ నాగ్య, ముత్తారం గ్రామానికి చెందిన మేకల కొంరయ్య, రేణుకుంట్ల వెంకటయ్య, రాజయ్య, ఎలబోయిన అయిలయ్య, కొడూరి వెంకటయ్యను రజాకార్లు పట్టుకున్నారు. వీరందరిని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ నరహరి తండా మధ్యలోని వజ్రపు గుండుకు వరుసగా నిలబెట్టి రజాకార్లు తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. 8 మంది తెలంగాణ పోరాట యోధులను ఒకేసారి కాల్చి చంపడం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. తెలంగాణ యోధులు మిలిటెంట్ వ్యవస్థగా ఏర్పడి రజాకార్లతో పోరు సల్పేందుకు ప్రయత్నిస్తున్నారని రజాకార్లు కక్ష కట్టారు. 3 గ్రామాలకు చెందిన ఎనిమిది మంది తెలంగాణ యోధులను పట్టుకచ్చి వజ్రపు గుండుకు కాల్చి చంపడం ఈ ప్రాంతంలో ఇప్పటికీ చర్చనీయాంశంగా మారింది. రజాకార్ల రాక్షసత్వానికి వజ్రపు గుండు నిలువెత్తు సాక్షంగా మారింది.


తెలంగాణ యోధులను రజాకార్లు కాల్చి చంపిన నరహరి తండాలోని గుట్ట

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

- పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్
- మంత్రి సురేఖ ఇంటి ముట్టడికి యత్నం
- మంత్రి హామీతో ఆందోళన విరమణ

రాంగనర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పీఎం శ్రీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ప్రీ ప్రైమరీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీలు తలపెట్టిన మంత్రి సురేఖ ఇళ్లు ముట్టడి ఉద్రిక్తతలకు దారి తీసింది. ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి తరలివస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికి అక్కడ ముంద స్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించారు. హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసం ఉండే పరిసరాల్లోకి అంగన్‌వాడీలు రాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేసి దారులు మూసివేశారు. అయినా గ్రేటర్ వరంగల్‌లోని అంగన్‌వాడీలు పోలీసుల నిర్బంధాలను, అడ్డగింతలను దాటుకొని మంత్రి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. అరెస్టు చేసిన వారందరిని వెంటనే విడుదల చేయాలని భీష్మించుకొని కూర్చోవడంతో నిర్బంధించిన వారినంతా వదిలేయడంతో వారంతో సురేఖ ఇంటి వద్దకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ సంఘమైన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవధ్యక్షుడు రాగుల రమేశ్ మాట్లాడుతూ ప్రమాదకరమైన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాల్సిన ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయాలని చేస్తుందని మండిపడ్డారు. పీఎం శ్రీవిద్య పథకంలో భాగంగా ఐదు సంతవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తప్పనిసరిగా చేసిన ఫేస్ క్యాప్చర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్‌కు పోషకహారానికి లింకు పెట్టడం వల్ల చాలా మంది పేదలు నష్టపోతున్నారని తక్షణమే ఈ విధానం రద్దు చేసి 5 జీ నెట్ వర్క్ మొబైల్స్‌ను అందించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను 13 నెలల కింద ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 18,000 వేతనం, పీ.ఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. కాగా, స్థానిక సీఐ మేకల రంజిత్‌తో పాటు మంత్రి నివాసంలో అందుబాటులో ఉన్న పీఏతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి తాను లోకల్‌లో లేను వరంగల్ రాగానే అంగన్‌వాడీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై డిమాండ్లను పరిష్కరించేదిశగా కృషి చేస్తానని అంగన్‌వాడీలకు చెప్పాలని తెలపడంతో అదే విషయాన్ని సీఐ, పీఏ అంగన్వాడీలకు చెప్పడంతో 15 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పీఏకు ఇచ్చి ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, చుంచు విజేందర్, అంగన్వాడీ కార్యకర్తలు వీరగోని నిర్మల, శోభరాణి, రాజేశ్వరీ, రమాదేవి, జమున, హైమావతి, రజిత, అనిత, శారద, షైముదా, అంజుమ్, వందలాది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాంనగర్ కొండా సురేఖ ఇంటి ముందు బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

ఉల్లికోడు తెగులు - నివారణ చర్యలు

రైతులకు శాస్త్రవేత్తల సలహాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వరిలో ఉల్లికోడు తెగులు ఆశిస్తున్నది. దీని నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్(వరంగల్) ప్రధాన శాస్త్రవేత్త ఎల్.కృష్ణ కొన్ని సూచనలు ఇస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ఆలస్యంగా నాటు వేయడం వల్ల ఈ తెగులు ఆశిస్తుందని అంటున్నారు. ఉల్లికోడు లక్షణాలు, నివారణ చర్యల గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

తెగులు లక్షణాలు..

కీటకాలు వరి ఆకుల కొనల దగ్గర, ముచ్చ మట్టలమీద విడివిడిగాను, లేదా గుంపులు గుంపులగాను గుడ్లు పెడుతాయి. వీటి నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చి అంకురం వద్ద చేరి నష్టం చేస్తాయి. అంకురం లేతాకుపచ్చ లేదా ఆకుపచ్చని పొడవాటి గొట్టంగా మార్పు చెంది బయటకు వస్తుంది. వీటిని గొట్టాలు, రాగి గొట్టాలు, ఉల్లి గొట్టాలని పిలుస్తారు. ఈ పురుగు ఆశించిన పిలక నుంచి ఎలాంటి కంకులు ఏర్పడవు. పక్క పిలుకలు ఎక్కువగా వస్తాయి.



నివారణ చర్యలు

సిఫారసు చేసిన సమయం లోపల నాట్లు పూర్తి చేయాలి. డబ్ల్యూజీఎల్ -1119 లాంటి తట్టుకునే రకాలను సాగు చేయాలి. పొలం గట్లపై కలుపులేకుండా చూసుకోవాలి. నాటిన 10-15 రోజులలో ఎకరానికి 10కిలోల కార్బొఫ్యూరాన్ 3 సీజీ గులికలు బురద పదునులో చల్లాలి. లేదా ఫిప్రోనిల్ 5 ఎస్‌సీ లీటరు నీటిలో 2.5 మి.మీ నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ముఖ్యంగా ఆగస్టు చివరి వారంలో నాట్లు వేసిన రైతులు ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బొఫ్యూరాన్ 3సీజీ గులికలు చల్లాలి.

22న పత్తి రైతుల సమస్యలపై సదస్సు

రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

గిర్మాజీపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే లక్ష్యంతో ఈనెల 22న ఉమ్మడి వరంగల్ జిల్లా పత్తి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ అబ్బనికుంటలో గల తెలంగాణ రైతు భవనంలో సోమవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఉపాధ్యక్షుడు ఉరటి అంశాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 11 శాతం సుంకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఎత్తివేయడంతో దేశంలోని పత్తి రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా పనిచేస్తున్నదని ఆరోపించారు. ఆయనకు రైతుల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వ్యవసాయ కమిషన్ ప్రకటించిన ప్రకారం పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రు.12,000/లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అబ్బనికుంటలోని రైతు సంఘం భవనంలో జరిగే సదస్సుకు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పత్తి రైతులు ఈ సదస్సుకు తరలిరావాలని కోరారు. అనంతరం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కత్తి సుధాకర్, జిల్లా నాయకులు ఎం. పీరయ్య, ఎస్.భిక్షపతి, జె.జనార్దన్‌రెడ్డి, కె. రవీందర్, బి. ఎల్లయ్య పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్ద సదువులు బంద్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాల్గొన్న అన్ని ప్రైవేటు కాలేజీలు
- రోడ్డెక్కిన డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులు
- రాస్తారోకోతో అదాలత్ వద్ద ఉద్రిక్తం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య పిలుపు మేరకు సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటించాయి. మొత్తం 397 డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తివిద్యా కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, వాటిలో పని చేసే అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. కళాశాలల బంద్ దృష్ట్యా వీటి ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లలోని విద్యార్థులను ఆదివారమే ఖాళీ చేయించారు. బంద్ విరమణ జరిగే వరకు ఎవరూ రావద్దని తెలియచేశారు. హనుమకొండతో పాటు వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సైతం ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి.

భారీ ర్యాలీ

హనుమకొండ హంటర్ రోడ్డు నుంచి సుబేదారిలోని అదాలత్ సెంటర్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని, ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాసిన ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. ఈ ర్యాలీకి ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యాలు సంఘీభావం తెలిపాయి. పీజీ, డిగ్రీ కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ర్యాలీలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ధర్నా, బైఠాయింపు

అదాలత్ సెంటర్ వద్ద విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు సుబేదారి పీఎస్‌కు తరలించారు. విద్యార్థులను బలవంతంగా తొలగించడంతో వారికి పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర

హనుమకొండ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఫీజు బకాయిలు చెల్లించడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయడకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సీఎం ఫీజు బకాయిల విడుదలపై మాట తప్పారని, గతంలో డిగ్రీ కళాశాలలు రాష్ట్రవ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు బహిష్కరించడం వల్ల సకాలంలో పరీక్షలు జరగలేదన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్తే పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల కాక డిగ్రీ పూర్తయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరీ సర్టిఫికెట్లను తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలు సైతం ఈనెల 15 నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించాయన్నారు. బంద్ వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు వినయ్, టీపీడీపీఎంఏ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.


అదాలత్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బంద్ చేసినా స్పందించరా ?

ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుందర్‌రాజ్ యాదవ్

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ధ్వజమెత్తారు. కళాశాల బంద్ వల్ల విద్యార్థులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయాలని ప్రభుత్వ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు వేతనాలు చెల్లించేందుకు, సంక్షేమ పథకాలపై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడానికి మాత్రం చేతులు రావడం లేదన్నారు.

పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ నిరసన



చిట్యాలలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

టేకుమట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వింతవులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి, మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్, నాయకులు రాం రాంచందర్, రేణుకుంట్ల సంపత్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్, వికలాంగుల సంఘం నాయకులు కుమార స్వామి, కొండ్ర తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

- రేగొండ (ఆంధ్రజ్యోతి): రేగొండలో జరిగిన తహసీల్దార్ కార్యాలయం ముట్టడిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్యాం బాబు మాదిగ, నాయకులు మంద కిరణ్, చావటి సంతోషి, వీహెచ్ పీఎస్ మండల నాయకులు గడ్డం రమేష్, ఎడ్ల విజయలక్ష్మి పాల్గొన్నారు.
- మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఎం. లచ్చయ్య, మండల అధ్యక్షుడు పంగ రాజయ్య, నాయకులు పులియాల రాజయ్య, చందు, మంద శ్రీను, తిరుపతి, రమేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.
- మల్హర్ (ఆంధ్రజ్యోతి) : తాడిచర్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు కన్నవేని లక్ష్మణ్, నాయకులు మంథని సమ్మయ్య, కన్నూరి సారయ్య, విజయ్‌కుమార్, సందీప్, నవీన్, పోచయ్య, మధుకర్, సారక్క తదితరులు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రేణుకుంట్ల సంపత్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మంద సాంబయ్య, నిమ్మల భద్రయ్య, జీడి సంపత్, సారంగపాణి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణగౌడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణగౌడ్, బెగ్లూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కుంబాపు, అంబటిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలాచారి, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు కొయ్యల భాస్కర్, చింతకుంట సదానందం, లింగాల సుశాంత్ పాల్గొన్నారు.
- చిట్యాల (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకుడు నేరెళ్ల ఓదెలు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు జేరిపోతుల ఓదెలు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్, నాయకులు జిల్లెల పోశాలు, దుర్గయ్య, ఐలయ్య, రాజయ్య, లక్ష్మి, భద్రయ్య, చేరాలు, బొట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

పెరిగి.. తగ్గిన గోదావరి

వాజేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక్కసారిగా గోదావరికి వరదనీరు పోటెత్తింది. ఆదివారం రాత్రి 11గంటలకు 14.880 మీటర్ల నీటిమట్టం మండలంలోని పేరూరు వద్ద ఉండగా సోమవారం ఉదయం 8గంటలకు 15.420 మీటర్ల నీటిమట్టానికి చేరుకుని 11గంటల వరకు నిలకడగా ఉంది. అనంతరం 12గంటల నుంచి తగ్గుముఖం పట్టి సాయంత్రం 6గంటలకు 15.200 మీటర్లకు చేరుకుని తగ్గింది. ఈక్రమంలో వాజేడు మండల కేంద్రంలో కొంతమంది రైతుల మిర్చి పంటలను వరదనీరు ముంచెత్తింది. అదేవిధంగా టేకులగూడెం జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి : ఐటీడీఏ ఏపీవో

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనదర్బార్‌లో వివిధ సమస్యలపై సమర్పిస్తున్న వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల వద్ద నుంచి ఆయన వినతులను స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 12మంది గిరిజనులు తమ సమస్యలను ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కొత్తగూడ, గోవిందరావుపేట, కన్నాయిగూడెం తదితర మండలాల నుంచి గిరిజనులు ఐటీడీఏకు తరలివచ్చి గిరి వికాసం పథకం, పోడు భూము లకు పట్టాలు, పాఠశాలల్లో ప్రవేశాలు, వికలాంగుల పింఛన్, తదితర సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాములు నాయక్‌ను కలిసిన గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు



రాములునాయక్‌ను సన్మానిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ, రైతు సంక్షేమ కమిషన్ మెంబర్ రాములు నాయక్‌ను ఏరియాలోని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు సోమవారం కలిశారు. హైదరా బాద్‌లోని ఆయన్ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కలిసి సత్కరించారు. గిరిజన ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఉండేందుకు రాష్ట్ర కమిటీ సిఫార్సు చేయగా అందుకు ఆయన అంగీకరించారని నేతలు తెలిపారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రాములు నాయక్ త్వరలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి సమస్యలను వివరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డి ప్యూటీ జనరల్ సెక్రటరీ బొర్రా రాంబాబు, ఏరియా లైసన్ ఆఫీసర్ కల్తీ రమేష్, మోదిన్ నాయక్, ధరావ త్ రమేష్, ఇస్లావత్ గౌతమ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు

కాటారం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ పశువైద్యశాల పరిధిలోని గుమ్మళ్లపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తెల్ల జాతి పశువులకు ఎల్ఎస్‌డీ(లంపీ స్కిన్ డిసీజ్) వ్యాక్సిన్లు సోమవారం వేశారు. ముద్ద చర్మవ్యాధి నివారణ కోసం గ్రామాల్లో ఆవుజాతి పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్నట్లు మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. లంపీస్కిన్ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వెటర్నరీ వైద్యులు, లేదా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ఆవుజాతి పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ధీరజ్, రమేష్, వెటర్నరీ అసిస్టెంట్ తుంగల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపల్లిలో ఎపిడమిక్ టీం పర్యటన

మల్హర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యాధికారి మధుసూధన్, జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి ఉమాదేవి ఆదేశాల మేరకు మండలంలోని ఎడ్లపల్లిలో జిల్లా ఎపిడమిక్ టీం సభ్యులు సోమవారం పర్యటించారు. గ్రామంలో డ్రై డే నిర్వహించి దోమల మందు తిమోఫాస్‌ను స్ప్రే చేయించారు. గ్రామంలో మోడల్ స్కూల్లో హస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పిల్లలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిడమిక్ టీం సభ్యులు రమేష్, పరమేశ్వర్, సతీష్, రాజు, గోపి, హెల్త్ అసిస్టెంట్ హేమ్‌సింగ్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఏబీవీపీ నగర కార్యదర్శిగా అజయ్

చిట్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ చిట్యాల నగర కార్యదర్శిగా ముష్కె అజయ్ నియామకమయ్యారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఏబీవీపీ ప్రాంత హాస్టల్స్ ఇన్‌చార్జి వేల్పుల రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యారంగ సమస్యల సాధన కోసం సంఘం బాధ్యులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ సభ్యులు కృష్ణ, నాగరాజు, శశివర్ధన్, హర్ష, అభిరామ్, రాజేష్ పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగాన్ని పెంచాలి

గణపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాలకు నానో యూరియా వాడకం పెంచాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి నానో యూరియా ఉపయోగం, పంటల పరిశీలన, యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా నానో యూరియా ఉపయోగాలు రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ఐలయ్య, ఏఈవోలు కళ్యాణ్, అమూల్య, పవన్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో జీపీ కార్మికుడి మృతి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్న పసుల పచ్చయ్య (50) సోమవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్య బారిన పడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచాడు. మృతదేహాన్ని భూపాలపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజు, సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు. తక్షణ సహాయం కింద రూ. 10వేలు అందించారు.

గ్రామీణ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని బంగ్లాపల్లిలో రూ.57 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన సోమ వారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియో జకవర్గాన్ని సీఎం, మంత్రుల సహాయంతో పూర్తిస్థాయిలో అభి వృద్ధి చేస్తానని, సంక్షేమ పథకాల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేదిలేదని అన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింహారావు, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫీ, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, కటంగూరి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, తదితరులు పాల్గొన్నారు.



బంగ్లాపల్లిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

విద్యారంగ అభివృద్ధే ప్రధానం

గణపురం, (ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అధ్యక్షుడు కృష్ణయ్య సొంత ఖర్చుతో చేపట్టిన విద్యార్థులకు యూనిఫాం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు రాజేందర్, కుమార్, రాజయ్య, కట్కూరి శ్రీనివాస్, శివశంకర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కాటారం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు తోడ్పడే పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కాటారం ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య అన్నారు. కాటారంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఔషధ, పండ్లు, పూలనిచ్చే చెట్లకు సంబంధించిన వందలాది మొక్కలను నాటి ఏఎంసీకి ఆదాయ వనరు గా మార్చడానికి కృషి చేస్తున్నట్లు తిరుమల అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కాటారం జీపీ కార్యదర్శి సమీర్‌ఖాన్, టెక్నికల్ అసిస్టెంట్ మనోజ్, ఎఫ్ఏ రాజమణి, కాంగ్రెస్ నాయకులు ఆత్మకూరి కుమార్, భూపెల్లి రాజు, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి

డీఎంహెచ్‌వో మధుసూదన్

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో మధుసూదన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్- 2010 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోలేని ఆస్పత్రులపై చర్యలు తప్పవన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. ఈకార్యక్రమంలో ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభం

కాటారం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం క్రీడా మైదానంలో ఎస్జీఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ఆఫ్ ఇండియా) మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంఈవో శ్రీదేవి, గురుకుల ప్రిన్సిపాల్ రాజేందర్, ఎస్సై శ్రీనివాస్ క్రీడోత్సవాలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, గురుకులాలకు చెందిన బాలికల జట్లు కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడాంశాల్లో అండర్-14, 17 విభాగాల్లో పోటీ పడ్డాయి. పలువురు విద్యార్థులు జోన్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నేడు ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జోన్ కన్వీనర్ విజయలక్ష్మి, మండల కన్వీనర్ రాధ, కో-కన్వీనర్ మంథెన శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు గౌతమి, వీరన్న, మహేందర్, రమేష్, మాజీనా, శ్రీధర్, కార్తీక్, రాజేశ్వరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

- రేగొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రేగొండ, గోరికొత్తపల్లి మండలాల క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారం భమయ్యాయి. ముఖ్య అతిథిగా కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య హాజరయ్యారు. ఎంఈవోరాజు, ప్రదానోపాధ్యాయురాలు మాధవీ లత, జిల్లా యువజన క్రీడల అధికారి రఘు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి : అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే వినతులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సంపత్‌రావు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆయన 71 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూ కట్టిన రైతులు



చిట్యాలలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



కాటారంలో చెప్పులను లైన్‌లో పెట్టిన రైతులు

కాటారం/చిట్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాటారం మండలంలోని దామెరకుంట, రేగులగూడెం రైతు వేదికల వద్ద యూరియా బస్తాల కూపన్ల కోసం సోమవారం రైతులు ఎగబడ్డారు. ఆదివారం రేగులగూడెం క్లస్టర్ పరిధిలో 360 యూరియా బస్తాలు, దామెరకుంట క్లస్టర్‌కు 220 బస్తాలు రాగా రైతు వేదికల్లో నిల్వ చేసే పరిస్థితి లేక పీఏసీఎస్ గోదాం లో అన్‌లోడ్ చేశారు. దీంతో బస్తాలను పంపిణీ చేయడానికి వ్యవసా యాధికారులు కూపన్లు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టారు. దీంతో ఉదయాన్నే రైతు వేదికల వద్ద రైతులు భారీ సంఖ్యలో వచ్చి తమ చెప్పులను రైతు వేదిక ఎదుట లైన్‌లో పెట్టి వేచి చూశారు. ఏఈవోలు అస్మా, దీపక్‌తో పాటు పీఏసీఎస్ సిబ్బంది ఒక్కో బస్తా చొప్పున అందించారు.

చిట్యాలలో..

యూరియా కోసం మండల కేంద్రంలోని గ్రోమోర్, ఆగ్రోస్, ఏడీసీఎంఎస్ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. మూడు కేంద్రాలకుగాను ఆదివారం 35 టన్నుల యూరియా దిగుమతి అయ్యింది. సమాచారం తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే ఆయా కేంద్రాల ముందు క్యూలైన్‌లో నిలబడ్డారు ఎస్సై శ్రావన్‌కుమార్ అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

స్వయం ఉపాధికి సింగరేణి కృషి

ఏరియా పర్సనల్ మేనేజర్ మారుతి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి మార్గాలు కల్పించేందుకు సింగరేణి ప్రత్యేకంగా కృషి చేస్తోందని భూపాలపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో ఉన్న సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో వృత్తి శిక్షణ కోర్సులకై రాత పరీక్ష నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారం భించారు. మహిళలు శిక్షణ పొందిన తరువాత స్వయంగా ఉపాధి మార్గాలను అన్వేషించు కోవ చ్చునన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, డీటీపీ, జ్యూట్ బ్యాగ్ కోర్సులకు 148 మంది హాజరైనట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కోఆర్డినేటర్ శివకుమార్, పి. శ్రావణ్‌కుమార్, రాజు, రుబీన పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల వినతి

కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులు కొత్తగూడెం జీఎం లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని సమర్పించారు. భూపాలపల్లి ఏరియా పర్యటనకు ఆయన రాగా తమ సమస్యలు వివరించారు

రెస్క్యూ కాంపిటీషన్‌లో ప్రతిభ

రామగుండంలో-2 ఏరియాలో జరిగిన జోనల్ మైన్స్ రెస్క్యూ కాంపిటీషన్‌లో ఏరియా ఉద్యోగులు దీప్తి, స్వాతి, ఎల్. స్వాతి, అనూష, షైనీ, సంధ్య, భాను, ప్రమోద్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, శ్రావణ్, మురళీ ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పాల్గొని సత్తాచాటారు. వీరిని భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎస్ వోటూ జీఎం కవీంద్ర, సివిల్ ఏజీఎం రవికుమార్, రక్షణ అధికారి ప్రసాద్, రెస్క్యూ ఇన్‌చార్జి పూర్ణచందర్ తదితరులు అభినందించారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

కాటారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ప్రీ ప్రైమరీ వ్యవస్థను రద్దు చేయాలని సీఐటీయూ పిలుపునివ్వడంతో యూనిఫాంలో శిక్షణా కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఆందోళనలో పాల్గొనేందుకు కాకుండా తాము మహదేవపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శిక్షణ కోసం వెళ్తుండగా అరెస్టు చేయం దారుణమని అంగన్‌వాడీల సంఘం నేతలు శ్రీలతారెడ్డి, కమలా దేవి ఆరోపించారు.

బహుజన బతుకమ్మ కరపత్రం ఆవిష్కరణ

(5వ పేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్‌లో పదిమంది విప్లవవీరులు అసువులు బాసారని అన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, లైంగిక వేధింపులు, హత్యాకాండలను నిరసిస్తూ పూల కవాతుతో ఈనెల 26న ములుగు జిల్లా పెద్దాపూర్‌లో జరిగే బహుజన బతుకమ్మను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర నాయకుడు కొండన్న, సామ అంతిరెడ్డి- పూలక్క కుటుంబసభ్యులు సామ మోహన్‌రెడ్డి, చిన్న పూలక్క, పీవోడబ్ల్యూ నాయకురాళ్లు కవిత, పద్మ, ఆదివాసీ నాయకులు విక్రమ్, శాంత్, రైతుకూలీ సంఘం నాయకుడు యుగేందర్, ు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ స్థల పరిశీలన

వాజేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ స్థలాన్ని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకుడు నల్లగాని రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మయ్య, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

జీపీవోలు సమన్వయంతో పనిచేయాలి

వెంకటాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలన అధికారులు (జీపీవో) సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ గిరిబాబు సూచించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఇటీవల విధుల్లో చేరిన జీపీవోలతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. జీపీవోలకు కేటాయించిన గ్రామాల్లో ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని, గ్రామాల్లో నెలకొనన భూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ప్రతి భూ సమస్యపై ప్రత్యేక అవగాహనతో ముందుకువెళ్లి రైతుల భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

కిరాణా షాపులను తనిఖీ చేసిన పోలీసులు

వెంకటాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా స్థానిక ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నార్కోటిక్ డాగ్‌తో మండలంలోని నల్లగుంట గ్రామంలోని కిరాణాషాపులను సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా మాదకద్రవ్యాల రవాణా గానీ, విక్రయించడం, సేవించడం గానీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దినసరి వేతన కార్మికుల ఆందోళన

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవో 64ను ఉపసంహరించుకోవడంతోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో ఏళ్లతరబడి రోజువారీ వర్కర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిని ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలం చెందిందని విమర్శించారు. దినసరి వేతన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఆరోపించారు. కార్మికులు నాలుగురోజులుగా సమ్మె చేస్తున్నా ఐటీడీఏ అధికారు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. ఆందోళన అనంతరం ఏపీవో వసంతరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భాగ్యలక్ష్మి, సారబాబు, ఇందిర, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

నేటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

వాజేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్న వైద్యశిబిరాన్ని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ప్రారంభించనున్నారని తెలిపారు. వైద్యశిబిరానికి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

గుండెపోటుతో కేబుల్ కార్మికుడి మృతి



సత్తిబాబు మృతదేహం

వాజేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కేబుల్ కార్మికుడు మృతిచెందిన సంఘటన సోమవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజోలుకు చెందిన సోలబోయిన సత్తిబాబు(45) కొన్ని రోజులుగా వాజేడు మండలంలోని ఓ ప్రైవేట్ కేబుల్ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్ర మంలో మధ్యాహ్నం సమయంలో కేబుల్ వైర్లు లాగిన అనంతరం ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. దీంతో తోటి కార్మికులు అతడి వాజేడు వైద్యశాలకు తర లించగా పరీక్షించిన వైద్యాధికారి గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు.

మంత్రి సీతక్క చొరవతో విద్యార్థులకు బస్సు సౌకర్యం

వాజేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు గత నాలుగు నెలల నుంచి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో స్థానికులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి వరంగల్ -1 డిపో అధికారులతో మాట్లాడి తక్షణమే బస్సును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో వరంగల్-1 డిపో అధికారులు మండలంలోని పేరూరు నుంచి ధర్మవరం, చెరుకూరు, గుమ్మడిదొడ్డిమీదుగా వాజేడుకు బస్సు సర్వీసును ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాస్కర్, మేనేజర్ అర్పిత, పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : జయశంకర్

Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664